ప్రజాజ్యోతి తెలుగు జాతీయ పత్రికకు విలేకరులు కావలెను

* కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా వార్తల్లో ముందుకు దూసుకుపోతున్న ప్రజాజ్యోతి దినపత్రిక కు వివిధ మండలాలకు రిపోర్టర్లు కావలెను
* బాన్సువాడ టౌన్, కామారెడ్డి టౌన్, కామారెడ్డి ఆర్బి, బిచ్కుంద, బీర్కూర్, తాడ్వాయి, లింగంపేట, నస్రుల్లాబాద్, మండలాలకు రిపోర్టర్లు కావలెను
* కనీస విద్యార్హత ఉంటే సరిపోతుంది. మిగతా వివరాలకు ఈ క్రింది నెంబర్ ను సంప్రదించండి.

96665 56646

జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
నిజామాబాద్ కామారెడ్డి
బుధవారం, జనవరి 7, 2026 పేజీలు: 7



## రైతు భరోసా కోసం ఎదురుచూపులు

- యాసంగి సీజన్ సగం గడిచినా అందని పెట్టుబడి సాయం
- అప్పులు తెచ్చి సాగు చేస్తున్న రైతులు
- భరోసాపై స్పష్టత ఇవ్వని ప్రభుత్వం



**సదాశివనగర్ జనవరి 6 (ప్రజాజ్యోతి)**
యాసంగి (రబీ) సీజన్ సగం దాటుతున్నా రైతు భరోసా పెట్టుబడి సాయం రైతుల ఖాతాల్లో జమ కాకపోవడంతో రైతాంగం ఆందోళనకు గురవుతోంది. ప్రభుత్వం ఎప్పుడు రైతు భరోసా నిధులు విడుదల చేస్తుందో స్పష్టత ఇవ్వకపోవడంతో రాష్ట్రవ్యాప్తంగా రైతులు ఎదురుచూపుల్లోనే ఉన్నారు.

వివరాలు మెయిన్‌లో


## వికటించిన మధ్యాహ్న భోజనం

### 8 మంది విద్యార్థులకు అస్వస్థత



**నాగిరెడ్డిపేట్,జనవరి6 (ప్రజాజ్యోతి):** మధ్యాహ్న భోజనం వికటించి 08 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. ఈ ఘటన నాగిరెడ్డిపేట్ మండలంలోని మాల్తుమ్మెద బాలుర ప్రాథమిక పాఠశాలలో మంగళవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే ఈ పాఠశాలలో ఒకటి నుంచి ఐదోతరగతి వరకు చదివే విద్యార్థులు 54 మంది ఉన్నారు. మంగళవారం

-మిగతా 2లో..



## అడవి దేవతల జాతరకు ఆహ్వానం



2 లో

### నేరాల నియంత్రణపై పోలీస్ అధికారులతో

## కమిషనర్ సమీక్ష




**నిజామాబాద్ రూరల్: జనవరి, 6 (ప్రజా జ్యోతి)**

నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ డివిజన్లలో పెండింగ్‌లో ఉన్న కేసుల పురోగతిపై సోమవారం పోలీస్ కమిషనర్ శ్రీ పి. సాయి చైతన్య సమగ్ర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఏసీపీలు, సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.
ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ సీ.ఎం.ఆర్ కేసుల్లో దర్యాప్తును వేగవంతం చేసి, సాక్ష్యాల సేకరణలో నిర్లక్ష్యం లేకుండా చూడాలని ఆదేశించారు. ఎక్కువకాలంగా పెండింగ్‌లో ఉన్న కేసులను ప్రాధాన్యతగా తీసుకుని త్వరితగతిన పరిష్కరించాలని

-మిగతా 2లో..

# వికటించిన మధ్యాహ్న భోజనం

పాఠశాలకు 48 మంది విద్యార్థులు హాజరయ్యారు.పాఠశాలలో ఆకు కూర పెసరు పప్పు వంట చేయగా విద్యార్థులు మధ్యాహ్న భోజనం తర్వాత విద్యార్థులు ఒక్కొక్కరిగా అస్వస్థతకు గురై అందులో 8 మంది విద్యార్థులు కడుపు నొప్పి,వాంతులు,ఛాతి నొప్పిగా ఉందని ప్రధానోపాధ్యాయురాలు లక్ష్మ తులసికి తెలియజేసారు.దింతో వెంటనే ప్రధానోపాధ్యాయురాలు గ్రామస్థులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న గ్రామ సర్పంచ్ పుప్పాల సాయిలు 108 కు సమాచారం అందించడంతో అంబులెన్సు సహాయంతో విద్యార్థులను ఎల్లారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు.అస్వస్థకు గురైన విద్యార్థులలో 5వ తరగతికి చెందిన ఆదర్శ,ప్రేమ్,సాయి తేజ,దుర్గ ప్రసాద్,ప్రవీణ్,రోహిత్, హేమంత్,హర్షిత్ లతో పాటు 4వ తరగతి చెందిన శశివర్ధన్ లు ఉన్నారు.విషయం తెలుసుకున్న ఎల్లారెడ్డి ఆర్డివో పార్థసింహారెడ్డి ఆసుపత్రికి వెళ్లి విద్యార్థులను పరామర్శించి తల్లిదండ్రులతో మాట్లాడారు.మధ్యాహ్న భోజనం నమూనాలను ప్రయోగశాలకు పంపి బాధ్యుల మీద చర్యలు తీసుకుంటామని తెలిపారు.ప్రస్తుతం విద్యార్థుల ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలపడంతో వారికి మెరుగైన వైద్యం అందించాలని వైద్య సిబ్బందికి ఆదేశించారు.

## నేరాల నియంత్రణపై పోలీస్ అధికారులతో

# కమిషనర్ సమీక్ష

సూచించారు.వైట్ కాలర్ నేరాలు, ముఖ్యంగా సైబర్ మోసాలు, బ్యాంకింగ్ ఫ్రాడ్‌లు వంటి వాటిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి సాంకేతిక పరిజ్ఞానం వినియోగించాలని సూచించారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు బ్లాక్ స్పాట్ల గుర్తింపు, సైన్ బోర్డుల ఏర్పాటు, డ్రంక్ అండ్ డ్రైవ్, ఓవర్ స్పీడ్, మైనర్లు వాహనాలు నడపడం వంటి ఉల్లంఘనలపై స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహించాలని ఆదేశించారు. రోడ్డు భద్రత నిబంధనలపై ప్రజల్లో అవగాహన కల్పించాలని తెలిపారు.

ఈ సమావేశంలో అదనపు డీసీపీ జి. బస్వా రెడ్డి, ఏసీపీలు, సీఐలు, ఎస్సైలు తదితరులు పాల్గొన్నారు.



# కళ్లకు కాటుక పేరుతో మోసం

### రెండు తులాల బంగారు గొలుసు మాయం

**ధర్పల్లి జనవరి 06 (ప్రజాజ్యోతి)**

ధర్పల్లి మండలం దుబ్బాక గ్రామంలో కళ్లకు కాటుక పెట్టి మోసం చేసిన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. మధ్యాహ్న సమయంలో గ్రామంలో జనసంచారం తక్కువగా ఉన్న వేళ, ఓ గుర్తు తెలియని మహిళ వృద్ధురాలిని ఆశ్రయించి "కొత్తగా వచ్చిన కాటుక" అంటూ కళ్లకు పూసింది. కాటుక పూసిన వెంటనే ఆ వృద్ధురాలు స్పృహ కోల్పోయింది. ఈ అవకాశాన్ని ఉపయోగించుకున్న ఆ మహిళ వృద్ధురాలి మెడలో ఉన్న రెండు తులాల బంగారు గొలుసును తీసుకుని అక్కడి నుంచి పరారైంది.



విషయం గమనించిన కుటుంబ సభ్యులు గ్రామస్తుల సహాయంతో ఊరంతా వెతికి ఆ మహిళను పట్టుకున్నారు. అనంతరం ఆమెను దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ముందస్తు ఏర్పాట్లపై సమీక్ష.

**బోధన్ జనవరి 06 (ప్రజాజ్యోతి)**

రానున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమానికి సంబంధించిన ముందస్తు చర్యలపై తహసీల్దార్, సీడీపీవో లతో కలిసి బూత్ లెవల్ అధికారులతో మంగళవారం బోధన్ సబ్ కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఓటర్ల మ్యాపింగ్, కొత్త ఓటర్ల చేర్పు తదితర అంశాలపై సమగ్రంగా సమీక్షంచారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ, మ్యాపింగ్ మరియు ప్రోజెనీ శాతం మరింత మెరుగుపడేలా చర్యలు తీసుకోవాలని బీఎల్‌ఓలను ఆదేశించారు. సకాలంలో పనులు పూర్తయ్యేలా ప్రతి రోజు లక్ష్యలను నిర్దేశించామని తెలిపారు. పనితీరు తక్కువగా ఉన్న బీఎల్‌ఓలు వెంటనే సవరణ చర్యలు చేపట్టి పురోగతి సాధించాలని సూచించారు.



## అడవి దేవతల జాతరకు ఆహ్వానం

ఆర్మూర్,జనవరి 6(ప్రజాజ్యోతి)

ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేశ్ రెడ్డి కి మంగళవారం నాడు రాష్ట్ర మంత్రి సీతక్క ఈ నెల 28 నుంచి జరిగే అతి పెద్ద గిరిజన జాతర సమ్మక్క సారక్క జాతరకు రావాలని ఆహ్వానించారు.ఈ సందర్భంగా జాతర విశిష్టతను ఎమ్మెల్యే కు వివరించారు.ఎమ్మెల్యే మాట్లాడుతూ సమ్మక్క సారలక్క గిరిజనులు ఆరాధ్య దైవం జాతర కు తప్పకుండా కుటుంబ సమేతంగా హాజరవుతానని మంత్రితో అన్నారు.

## విద్యార్థుల్లో మేధస్సు వికాసానికి క్విజ్ పోటీలు అవసరం


### పంచాయతీరాజ్ ఈఈ రామ్మోహన్



**బోధన్ జనవరి 06 (ప్రజాజ్యోతి)**

విద్యార్థుల్లో మేధస్సు వికాసం, సాధారణ జ్ఞానం పెంపొందించడంలో క్విజ్ పోటీలు కీలక పాత్ర పోషిస్తాయని పంచాయతీరాజ్ ఈఈ రామ్మోహన్ పేర్కొన్నారు. మంగళవారం బోధన్ పట్టణంలోని క్రిసెంట్ హైస్కూల్‌లో నిర్వహించిన క్విజ్ పోటీలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పాఠ్యపుస్తకాలకే పరిమితం కాకుండా క్విజ్ పోటీలు, ఆటల పోటీల్లో పాల్గొనడం ద్వారా విద్యార్థులు విభిన్న అంశాలపై అవగాహన పెంచుకోవచ్చన్నారు. క్విజ్ పోటీలు మెదడును చురుకుగా ఉంచడంతో పాటు చదువుపట్ల ఆసక్తిని పెంచుతాయని తెలిపారు. ఇష్టపడి చదవడం, పోటీల్లో పాల్గొనడం అలవాటు చేసుకుంటే పదో తరగతి పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించవచ్చని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ జావిద్ అలీ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## జాన్కంపేటలో ద్విచక్ర వాహనం చోరీ



**బోధన్ జనవరి 06 (ప్రజాజ్యోతి)**




నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండలంలోని జానకంపేట్ గ్రామంలో ద్విచక్ర వాహనం చోరీ అయిన ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. గ్రామానికి చెందిన కొండే అన్వేష్ తన ద్విచక్ర వాహనం చోరికి గురైందని మంగళవారం ఫిర్యాదు చేసినట్లు ఎడపల్లి ఎస్సై ముత్యాల రమ తెలిపారు. ఫిర్యాదుదారు తెలిపిన వివరాల ప్రకారం, బజాజ్ పల్సర్ ద్విచక్ర వాహనం (రిజిస్ట్రేషన్ నంబర్ టీ 16 జుజు 8454)తో తన సొంత పనులు ముగించుకుని జనవరి 4వ తేదీ సాయంత్రం 4 గంటల సమయంలో ఇంటి ముందర పార్క్ చేసి ఇంట్లో నిద్రపోయాడు. మరుసటి రోజు జనవరి 5వ తేదీ ఉదయం 7 గంటలకు లేచి చూడగా, తాను పార్క్ చేసిన చోట వాహనం కనిపించలేదని తెలిపారు.గుర్తు తెలియని దొంగలు ద్విచక్ర వాహనాన్ని చోరీ చేసి తీసుకెళ్లినట్లు ఫిర్యాదులో పేర్కొన్నాట్లు తెలిపారు. ఈ పిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించినట్లు ఎస్సై ముత్యాల రమ తెలిపారు.

## నిజాంసాగర్ పీహెచ్‌సీ పరిధిలో ఆశ కార్యకర్తల సమీక్ష సమావేశం



**నిజాంసాగర్ జనవరి 6 ప్రజాజ్యోతి**

నిజాంసాగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో మంగళవారం ఆశ కార్యకర్తల సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో హెచ్ఈఓలు వెంకటనారాయణ, మధుసూదన్ పాల్గొని గ్రామ స్థాయిలో అమలవుతున్న ఆరోగ్య కార్యక్రమాలపై సమీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లో టీబీ వ్యాధి లక్షణాలు, వ్యాధి వ్యాప్తిని అరికట్టేందుకు తీసుకోవాల్సిన నివారణా చర్యలపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని ఆశ కార్యకర్తలకు సూచించారు. ముఖ్యంగా రెండు వారాలకుపైగా దగ్గు, జ్వరం, బరువు తగ్గడం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే ప్రభుత్వ ఆసుపత్రుల్లో పరీక్షలు చేయించుకునేలా ప్రజలను ప్రోత్సహించాలని తెలిపారు. అలాగే బీపీ, షుగర్ వంటి దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న రోగులు డాక్టర్లు సూచించిన మందులను క్రమం తప్పకుండా వాడేలా పర్యవేక్షించాలని ఆదేశించారు. మందుల వినియోగంలో నిర్లక్ష్యం వల్ల ఆరోగ్య సమస్యలు తీవ్రతరం అయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ప్రభుత్వ ఆరోగ్య పథకాలు పూర్తిస్థాయిలో లబ్ధిదారులకు చేరేలా ఆశ కార్యకర్తలు క్షేత్రస్థాయిలో మరింత చురుకుగా పనిచేయాలని సూచించారు. ఈ సమావేశంలో సూపర్వైజర్లు ఎలిజబెత్, సుభాష్, సాయిలు, ఆశ కార్యకర్తలు పాల్గొని తమ తమ గ్రామాల్లో చేపడుతున్న ఆరోగ్య కార్యక్రమాలపై వివరించారు. ప్రజారోగ్య పరిరక్షణలో ఆశ కార్యకర్తల పాత్ర కీలకమని అధికారులు ఈ సందర్భంగా పేర్కొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్లకు అటవీ అనుమతి అవసరం



**రాజంపేట జనవరి 6 (ప్రజా జ్యోతి)**

రాజంపేట మండల పరిధిలోని ఎల్లారెడ్డిపల్లి తాండ గ్రామంలో నలుగురికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు అయ్యాయి. అయితే ప్రతిపాదిత నిర్మాణాలు అటవీ భూముల పరిధిలో ఉన్నాయని అటవీ శాఖ అధికారులు పేర్కొన్నారు. అందువల్ల జిల్లా అటవీ అధికారి అనుమతి తీసుకోవాలని సూచించారు. అలాగే గ్రామంలోని ప్రాథమిక పాఠశాలల్లో మూత్రశాలల నిర్మాణానికి కూడా అటవీ శాఖ అనుమతి అవసరమని తెలిపారు. సంబంధిత అధికారులు ఈ అంశంపై తగిన చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

## ఆరోగ్యదూత పర్యటనకు భారీ విజయమే లక్ష్యం

### ప్రతి తాండా నుంచి ప్రజలు తరలిరావాలి: లబనా రాష్ట్ర అధ్యక్షుడు తాన్ సింగ్ నాయక్



**గాంధారి, జనవరి 6 (ప్రజాజ్యోతి):**

మహారాష్ట్ర ముఖ్యమంత్రి సహాయనిధి చైర్మన్ రామేశ్వర్ నాయక్, పౌరదేవి బాబు సింగ్ మహారాజ్‌ల ఆరోగ్యదూత పర్యటనను అత్యంత ఘనంగా నిర్వహించి విజయవంతం చేయాలని లబనా సమాజ్ రాష్ట్ర అధ్యక్షుడు తాన్ సింగ్ నాయక్ పిలుపునిచ్చారు. గాంధారి మండల కేంద్రంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, మండలంలోని ప్రతి తాండాలో సంబంధిత సర్పంచుల ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తిస్థాయిలో చేపట్టి, కార్యక్రమాన్ని ప్రజోత్సవంలా నిర్వహించాలని సూచించారు. అన్ని తాండాల నాయకులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని ఆరోగ్యదూత పర్యటనను విజయపథంలో నడిపించాలని కోరారు. ఈ సందర్భంగా గాంధారి మండల కేంద్రంలో సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లకు ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. రాబోయే జనవరి 8న కామారెడ్డి జిల్లా గాంధారి మండలంలోని వెంకటాపూర్ తాండ భాయేఘడ్‌లో నిర్వహించనున్న ఆరోగ్యదూత కార్యక్రమానికి ప్రతి తాండా నుంచి భారీ మోటారు వాహనాల ర్యాలీతో తరలివచ్చి, అతిథులకు ఘన స్వాగతం పలకాలని తాన్ సింగ్ నాయక్ సూచించారు. జరిగే సమావేశంలో మంగళ్‌చంద్ మహారాజ్, సూరజ్ మహారాజ్‌లతో పాటు లబనా సమాజ్ జిల్లా అధ్యక్షుడు బంతిలాల్, అమర్ సింగ్ నాయక్, దేవి సింగ్ (సర్పంచ్), ఛద్మల్ స్వాతిబాయి, సురేందర్ (గుర్జల్ తాండ సర్పంచ్), భామన్ జామునదాస్ (బీర్మల్ తాండ సర్పంచ్), గంగారాం (తిప్పరం తాండ సర్పంచ్), మండల అధ్యక్షుడు జగదీష్ నాయక్, రాతిరామ్ నాయక్, గోతి దర్బార్ తదితర నాయకులు పాల్గొనలని తెలిపారు. అన్ని తాండాల నుంచి ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై ఆరోగ్యదూత కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు.

## పలు గ్రామ పాలకవర్గాలకు సన్మానం



**రామారెడ్డి జనవరి 06 (ప్రజా జ్యోతి)**

సర్పంచులు ఉపసర్పంచ్ వార్డ్ మెంబర్లకు ఘన సన్మానం రెడ్డి పేట తండా ప్రాథమిక పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు, ఉపాధ్యాయులు అందరూ కలిసి స్కూల్ తండా సర్పంచ్ సలావత్ బుచ్చిరెడ్డి, ఉప సర్పంచ్ గంగావత్ రమేష్, జగదాంబ తండ సర్పంచ్ భూక్యా లతా బాయ్, నంద ఉప సర్పంచ్ గంగావత్ పూర్ణ, రాజు నాయక్, బట్టు తాండ సర్పంచ్ బట్టు బికినీ, ఉప సర్పంచ్ రాతుల కిషోర్, స్కూల్ తండా వార్డు సభ్యులకు అందరికీ ఘనంగా సన్మానించడం జరిగింది. స్కూల్ తండా వార్డు సభ్యులు రాతుల సవిత రంజిత్, గంగావత్ సేవ్య, గంగావత్ సంతోష్, సలావత్ లలిత, నరేష్, సలవత్ తిరుపతి, పాల్గొనడం జరిగింది.

## పోడు భూముల సదస్సును విజయవంతం చేయాలి

### జిల్లా అంతటా బంజారా నేతల సమైక్యత అవసరం: సురేందర్ రాథోడ్



**గాంధారి, జనవరి 6 (ప్రజాజ్యోతి)**

గాంధారి మండల కేంద్రంలో గురువారం నిర్వహించనున్న పోడు భూముల సమస్యల పరిష్కార సదస్సును విజయవంతం చేయాలని కామారెడ్డి జిల్లా ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు సురేందర్ రాథోడ్ పిలుపునిచ్చారు. మంగళవారం గాంధారి మండల కేంద్రంలో రాష్ట్ర ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం ఉపాధ్యక్షుడు మోహన్ నాయక్, మండల అధ్యక్షుడు బొట్టు మోతిరంతో కలిసి నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మారుతి కళ్యాణ మండపంలో నిర్వహించనున్న ఈ సదస్సుకు వ్యవసాయ శాఖ కమిషనర్ కోదండ రెడ్డి, ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాములు నాయక్‌తో పాటు ఎల్లారెడ్డి శాసనసభ్యుడు మదన్ మోహన్ రావు ముఖ్య అతిథులుగా హాజరవుతున్నారని తెలిపారు. పోడు భూముల సమస్యలు బంజారా సమాజానికి జీవనాధారంగా మారాయని, వాటి శాశ్వత పరిష్కారానికి ఈ సదస్సు కీలకమని పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని మండలాల నుంచి బంజారా నాయకులు, బంజారా ముద్దుబిడ్డలు భారీ సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం డివిజన్ అధ్యక్షుడు శ్రవణ్ నాయక్, సంఘం మండల అధ్యక్షులు శంకర్ నాయక్, బొట్టు మోతిరం నాయక్, రాములు నాయక్, దేవు నాయక్, రాంచందర్ నాయక్, మండల ప్రధాన కార్యదర్శి విజయ్ కుమార్, నరేందర్‌తో పాటు ఆయా మండలాల బంజారా నాయకులు పాల్గొన్నారు.

## రెడ్డి సంఘం నూతన కార్యవర్గం

**బీబీపేట్ మండల్ ప్రజా జ్యోతి జనవరి 6**

బీబీపేట్ మండలంలోని యాడారంగ్రామంలో రెడ్డి సంఘం నూతన కార్యవర్గం ఏర్పాటు చేయడం జరిగినది. సంఘం అధ్యక్షుడుగా గొబ్బూరు ప్రతాపరెడ్డి ఉపాధ్యక్షుడు గా భూపాల్ రెడ్డి కోశాధికారిగా నరేందర్ రెడ్డి సలహాదారుడిగా భూపాల్ రెడ్డి సన్నాఫ్ కృష్ణారెడ్డి లను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగినది. అనంతరం కార్య వర్గ సభ్యులను శాలువాలతో ఘనంగా సన్మానం చేయడం జరిగింది. మరియు సర్పంచ్ గొబ్బూరి సుధారాణి బాపురెడ్డిలను శాలువాతో సన్మానం చేయడం జరిగింది. సభ్యులందరికీ అధ్యక్షులు గొబ్బూరి ప్రతాప్ రెడ్డి ధన్యవాదములు తెలిపారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ ఇట్టి సంఘం ను అభివృధి పథంలో ముందుకు తీస్తుళ్లేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఇట్టి కార్యక్రమంలో రెడ్డి సంఘం అధ్యక్షుడు గొబ్బూరి ప్రతాప్ రెడ్డి, ఉపాధ్యక్షుడు భూపాల్ రెడ్డి, కోశాధికారి నరేందర్ రెడ్డి, బాపు రెడ్డి, మరియు రెడ్డి సంఘ సభ్యులు పాల్గొన్నారు.



## నిజాంసాగర్ తహసీల్దార్ బదిలీ

నిజాంసాగర్ ప్రజా జ్యోతి జనవరి 6

కామారెడ్డి జిల్లా నిజాంసాగర్ మండల కేంద్రంలోని రెవెన్యూ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న తహసిల్దార్ బిక్షపతి పెద్దకొడప్గల్ మండల కేంద్రానికి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో ఎల్లారెడ్డి ఆర్డీవో కార్యాలయంలో అసిస్టెంట్ డెవలప్‌మెంట్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్న భుజంగరావు నిజాంసాగర్ తహసిల్దార్‌గా నియమితులయ్యారు.



# జాతీయ కబడ్డీ పోటీలకు టెక్నికల్ రెఫరీగా నాగరాజు

## పోతంగల్ కలాన్ ఉన్నత పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడి ఎంపిక

**గాంధారి, జనవరి 6 (ప్రజాజ్యోతి)**

గాంధారి మండలంలోని పోతంగల్ కలాన్ ఉన్నత పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు నాగరాజు జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు టెక్నికల్ రెఫరీగా ఎంపికయ్యారు. జనవరి 7 నుంచి 11వ తేదీ వరకు తెలంగాణ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎద్దుల బయ్యారం లో నిర్వహించనున్న ఎస్.జిఎఫ్.ఐ. అండర్‌-17 జాతీయ స్థాయి బాలుర కబడ్డీ పోటీల్లో ఆయన విధులు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రంగారావు మాట్లాడుతూ, జాతీయ స్థాయిలో టెక్నికల్ రెఫరీగా మా పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు ఎంపిక కావడం గర్వకారణమని అన్నారు. ఇది పాఠశాలకే కాక గాంధారి మండలానికి కూడా ప్రతిష్టను తీసుకొచ్చిందని పేర్కొన్నారు. నాగరాజును కామారెడ్డి జిల్లా ఎస్.జిఎఫ్.ఐ. సెక్రటరీ హీరాలాల్, టీజీపేట అధ్యక్షుడు మధనాల స్వామి గౌడ్, కార్యదర్శి పయ్యావుల అశోక్, పాఠశాల ఉపాధ్యాయ బృందం, గ్రామ సర్పంచ్ వడ్ల అనుశ్రీఉబాలరాజు, గ్రామ ప్రముఖులు, గ్రామస్తులు అభినందించారు.



## వాతావరణ కాలుష్యానికి కారకులెవరు..?

### -- డా.పోలం సైదులు



**రామారెడ్డి జనవరి 06 (ప్రజా జ్యోతి)**

ప్రపంచీకరణ నేపథ్యంలో భాగంగా ‹అభివృద్ధి› అనే పేరుతో ప్రభుత్వాలు నూతన ఆర్థికవిధానాలు సృష్టించి,ప్రకృతికి వ్యతిరేకమైన అభివృద్ధిప్రణాళికల విస్తృతరూపమే ప్రధానకారణం.పాలకులు అంతర్జాతీయ ఆర్థికసంస్థలతో చేతులుకలిపి దేశవనరులను పెట్టుబడిదారులకు ధారాదత్తం చేయడానికి తీసుకుంటున్ననిర్ణయాలు పర్యావరణ కాలుష్యానికి దోహదపడుతు న్నాయ నడంలో ఎలాంటి అనుమానం అక్కరలేదు.వాతావరణంలో నత్రజని 78శాతం,ప్రాణవాయువు ఆక్సీజన్ 21శాతం,బొగ్గుపులుసు వాయువు,ఆర్గాన్,నియాన్,గ్జినాన్,హీలియం మొదలగు అన్నీ వాయువులు కలిసి ఒక్కశాతం కన్నా ఎక్కువగా ఉండకుండా నిర్ణిత నిష్పత్తిలో ఉంటే వాతావరణం సమతౌల్యంగా ఉంటుంది.కానీ నేడు వాతావరణంలో వివిధ వాయువుల పరిమాణం (నత్రజని,ఆక్సిజన్ తప్పా) పెరుగుతుంది.ఇటువంటి స్థితినే వాతావరణ కాలుష్యం అంటారు. దేశంలో తొలిసారిగా అంటే 1973లో ఉత్తరప్రదేశ్ లోని చమోలి జిల్లా (ఉత్తరాంచల్) లో పర్యావరణ పరిధి ద్వేయంగా చిప్కో ఉద్యమం,1970 నుండి 1980 వరకు దశాబ్దంపాటు అడవులు,నీటిహక్కులపై పర్యావరణవేత్తల పోరాటాలు,1984లో భోపాల్ విషవాయవు విషాదం,1997లో విశాఖపట్నంలో హిందూస్థాన్ పెట్రోలియం కార్పోరేషన్ లిమిటెడ్ చమురుశు ద్ధి కర్మాగారంలో సంభవించిన భారీపేలుడు లాంటివి.... ప్రభుత్వాల అశాస్త్రీయ వైఖరివల్ల స్వార్థప్రయోజనాలకు ధ్వంసమైన పర్యావరణానికి సజీవసాక్ష్యలుగా పరిగణించవచ్చు. ప్రపంచ ఆరోగ్యసంస్థ లెక్కలప్రకారం లక్షలలో రసాయనాలు ఉత్పత్తి అవుతుంటే వందలలో మాత్రమే అంతర్జాతీయ భద్రతా విలువలకు కుట్టుబడి నిలబడుతున్నాయి.ఒక్కొక్క రసాయన ఉత్పత్తిని పూర్తిగా పరీక్షంచడానికి మూడు సంవత్సరాలకుపైగా సమయం పడుతూ మరియు 5 లక్షల డాలర్లకుపైగా ఖర్చవుతుంది.ఇదిలావుంటే అదనంగా రోజురోజుకు మరో వేలరసాయనాలు మార్కెట్ లోకి విడుదల కా వడం,పరీక్షంచడానికి అధికసమయం,ఖర్చులతో కూడుకొని ఉండట మూలంగా ఎలాంటి నియంత్రణ లేకుండానే ఎన్నో రసాయనాలు మార్కెట్ లోకి వచ్చి పర్యావరణ కాలుష్యానికి కారణమవుతున్నాయి.ఇవియేగాకుండా ప్రపంచ ఆరోగ్య పరిశోధనల ప్రకారం ప్రపంచ వ్యాప్తంగా హెక్టారుకు 450 గ్రాముల క్రిమిసంహారక మందులను వాడుతుండగా మనదేశంలో సగటున 3 కిలోగ్రాములు వాడుతున్నారని,మనంవాడే క్రిమిసంహారక మందులన్నింటిలో 70 శాతం పాశ్చాత దేశాలు తయారుచేస్తున్నాయని,అవి అత్యంత ప్రమాదకరమైనవని గుర్తించి వాటివాడకాన్ని కొన్నిదేశాలలో నిషేధించాయని కొన్నినివేదికలద్వారాతెలుస్తుంది.విద్యుత్పాదన,వ్యవసాయరంగానికి,రవాణాలక ు,మంచినీటికై,వరదల నియంత్రణకు,టూరిస్టుల వినోదానికి ఇలా పలువిధాల ప్రయోజనాలకై చేపట్టిన బహుళార్ధసాధక ప్రాజెక్టుల వలన కలుగుతున్న పరిణామాలను పరిశీలించిన పర్యావరణ మేధావులు భారీప్రాజెక్టుల కలిగిన కలిగే ప్రయోజనాలకన్నా జరిగే నష్టం అనేకరెట్లు ఎక్కువుంటుందని,లక్షలాది ఆదివాసులు నిరాశ్రయులవుతారని హెచ్చరిస్తున్న సందర్భాలు అందరికీ తెలిసిందే. పాట్రిక్ మెకల్లి 1996లో తన “సైలెన్స్ డ్ రివర్సు అనే పుస్తకంలో ముంపుకు గురయ్యే భూములు దీర్ఘకాలంలో బ్యాక్టీరియాలకు ఆశ్రయంగా మారి,భూమిలోనున్న పాదరసాన్ని ఆకళింపు చేసుకుంటాయని దానిద్వారా మానవులు స్వీకరిస్తే మరింత ప్రమాదకరంగా మారి అంధత్వం,పునరుత్పత్తిశక్తి తగ్గిపోవడం,మెదడు దెబ్బతినడం లాంటి సమస్యలు ఉత్పన్నమవుతాయని మరియు రిజర్వాయర్లో పేరుకుపోయిన ఆకులు,అలముల నుండి వెలువడే కార్బన్ డై యాక్సైడ్,మీథేన్ లు వాతావరణంలో ఉష్ణోగ్రత పెంచేందుకు దోహదం చేస్తుందని కొన్ని సందర్భాలలో భూకంపాలకు దారితీస్తున్నదని వివరించడం జరిగింది. ప్లాస్టిక్ నేడు మనిషి జీవితంలో భాగమైంది.ప్లాస్టిక్ బ్యాగుల తయారీలో వాడే హానికరమైన రసాయనాలు ఆరోగ్యరీత్యా హానికరమైనవి,వాటివల్ల వచ్చే పొగ పంటల్ని నాశనం చేస్తుంది.క్యాన్సర్ రావడానికి కారణమైన వినైలోక్లోరైడ్ బెంజిన్ లాంటి విషపదార్ధాలుండటం వల్ల నరాలు దెబ్బతినడం,పుట్టే పిల్లల్లో జన్యుదోషాలు,జీర్ణ సంబంధ వ్యాధులు,పేగుల్లో గడ్డలు ఏర్పడుతాయని పర్యావరణవేత్తలు హెచ్చరిస్తున్నారు.భూమిలో కలిసిపోయే గుణంలేని ప్లాస్టిక్ బ్యాగులను పశువులు తినడం వల్ల ప్రాణాలు కోల్పోయిన సంఘటనలు కోకొల్లలు.వాటిని ఎక్కడ పడేసిన మట్టిలో కుళ్ళిపోక అవి విరజిమ్మే విషతుల్య రసాయనికచర్యలతో నేలపొరలు నిస్సారంగా మారుతున్నాయి ధ్వని సమాజంపై తీవ్ర ప్రభావాన్ని చూపుతుంది.75 డెసిబెల్స్ దాటినశబ్దాలు పలురకాల నష్టాలను చేకూరుస్తాయి.పరిశ్రమలలోని యంత్రాలు,డీజే బాక్సులు,మోటారువాహనాలు ధ్వనికాలుష్యాన్ని కలుగజేస్తాయి.వీటివల్ల చెవుడు,మనస్సుకు ప్రశాంతత లోపించడం,ఏకాగ్రత కోల్పోవడం,అల్సర్లు,చర్మవ్యాధులు,నరాలబలహీనత,రక్తపోటు,తలనొప్పి,జీర్ణశ క్తి నశించడం,బుద్ధి మందగించడం,అసంతృప్తి,వైరాగ్యం,గర్భిణీ స్త్రీలకు బరువుతక్కువ శిశువులు జన్మించడం,అంగవైకల్యం మొదలగు లక్షణాలు చేకూర్చుతాయి. దేశంలో పర్యావరణ పరిరక్షణకోసం 1972లో వన్యప్రాణి సంరక్షణ చట్టం,1974లో జలకాలుష్య నివారణ నియంత్రణ చట్టం,1980లో అటవీ పరిరక్షణ చట్టం 1981లో వాయుకాలుష్య నియంత్రణ చట్టం,1986లో పర్యావరణ పరిరక్షణ చట్టం మరియు 2002లో జీవవైవిధ్య చట్టాలు చేశారు. నీటికాలుష్య నియంత్రణ చట్టం ప్రకారం నీటిలో భౌతిక,రసాయనిక,జీవపరమైన సమస్యలు తీసుకువచ్చిన పదార్తలుగానీ,గృహ మరియు వ్యవసాయవసరాలకు భంగం కల్గించేవిగానీ నీటికాలుష్య కారకాలవుతాయి.రసాయనిక పరిశ్రమలు ఏర్పాటుచేసేముందు గానీ,తర్వాతగానీ దానివల్ల కలిగేనష్టాల గురించి ప్రజలకు తెలియబరచాలన్న నిబంధనలు ఏ చట్టంలో లేవు.జీవవైవిధ్య చట్టంద్వారా జీవవైవిధ్యాన్ని పరిరక్షంచడం,స్థానిక జీవన వనరుల వినియోగంపై నియంత్రణ చేపట్టాలి. కానీ ప్రభుత్వాలు ఏమేరలో చేబడుతున్నాయో అందరికీ తెలిసిందే.ఢిల్లీలో శీతాకాలం వచ్చిందంటే చాలు పొగమంచుతో రహదారులు కనిపియ్యని పరిస్థితి.అక్కడ కాలుష్యం ఏమేరలో పెరుగుతుందో అవగతమవుతూనే ఉన్నది.కాలుష్యానికి ప్రధాన కారణాలు వాహనాల సంఖ్య పెరగడం,పొరుగురాష్ట్రాల్లో పంటవ్యర్థాలను కాల్చడం,పారిశ్రామిక ఉద్గారాలు,నిర్మాణాల నుండి వెలువడే దుమ్ము,చెత్తను కాల్చడం మరియు శీతాకాలంలో నెమ్మదిగా వీచే గాలులవల్ల కాలుష్యం పేరుకుపోవడం జరుగుతుంది.కానీ నియంత్రణ అంతంతమాత్రమే.ఇదిలా ఉంటే అత్యంత పురాతన పర్వాత శ్రేణుల్లో ఆరావళిపర్వతాలు ఒకటి.ఇవి గుజరాత్,రాజస్థాన్,హర్యానా,ఢిల్లీ రాష్ట్రాలవరకు విస్తరించి ఉన్నది.థర్ ఎడారి తూర్పుకు విస్తరించకుండా అడ్డుకుంటూ,భూగర్భజలాలను పునరుద్దరిస్తూ,వన్యప్రాణులను సంరక్షస్తూ, చుట్టూత రాష్ట్రాలకు ప్రాణవాయువును అందిస్తుంది.ఈమధ్యన వెలువడిన కోర్టుతీర్పు వలన గనులతవ్వకానికి మార్గం సుగుమమైనట్లు తెలుస్తుంది.ఇదే జరుగుతే భవిష్యత్ తరాలకు అంధకారమవుతుందని పర్యావరణ శాస్త్రవేత్తలు తెలపడం ఒకింత భయాందోళనలకు గురిచేస్తుంది.ఎన్నిరకాల చట్టాలున్నప్పటికి అందులోని లొసుగులను వాడుకుంటూ నిర్వీర్యం చేస్తున్నారు.ప్రభుత్వాలు మారుతున్నప్పుడు వాటివల్ల కలిగే పరిణామాలను ఒకరిపై మరొకరు తప్పుబడుతున్నారే కానీ శాశ్వితపరిష్కారంవైపు అడుగులు పడతలేవన్నది ముమ్మాటికి వాస్తవం. దేశవ్యాప్తంగా ఎన్నో సదస్సులు నిర్వహించిన అమలువరకు వచ్చేసరికి నోచుకోవడంలేదు.ప్రపంచవ్యాప్తంగా గ్లోబల్ వార్మింగ్ వలన భవిష్యత్ మనుగడ కష్టమవుతుందని పర్యావరణ శాస్త్రవేత్తలు గగ్గోలు పెడుతున్నా అక్కడక్కడా తూ.తూ మంత్రంగా చర్యలుచేపడుతున్నారు తప్పా,మరొకటిలేదు.పర్యావరణవేత్తల ఆవేదనలను అర్ధంచేసుకోని రాబోయేముప్పును పసిగట్టి,ప్రణాళికాయుతంగా ఆచరణలో అమలుపరిచే కార్యక్రమాలనుచేపట్టి,పర్యావరణ కాలుష్యనియంత్రణకు పాటుపడాలని అందులో ప్రతి ఒక్కరి భాగస్వామ్యం ఉండాలని ఆశిద్దాం.

## మధ్యాహ్న భోజనం పరిశీలన

### - సర్పంచ్ కిషన్ యాదవ్



**రామారెడ్డి జనవరి 06 (ప్రజా జ్యోతి)**

రామారెడ్డి మండలంలో గల గొల్లపల్లి ప్రథమిక పాఠశాలలో సర్పంచ్ కిషన్ యాదవ్, ఉపసర్పంచ్ మధుసూదన్,వార్డ్ సభ్యులు మరి ప్రభాకర్, రెడ్డి మల్లేష్, రాజేశ్వర్ గొల్ల నవీన్, పాఠశాల సిబ్బంది.తో కలిసి పాఠశాలలోని మిడ్ డే మీల్స్ పరిశీలించడం జరిగింది. అదేవిధంగా భోజనం కూడా పిల్లలతో పాటు తినడం జరిగింది.

## బంద్ కు మద్దతునిచ్చిన బిఆర్ఎస్

### - కెమికల్ ఫ్యాక్టరీ నిరసన తెలుపుతూ7న బిక్కనూరు బంద్ కు పిలుపు



**భిక్కనూరు, జనవరి 6 (ప్రజాజ్యోతి)**

భిక్కనూరు మండలం పెద్ద మల్లారెడ్డి శివారులో గల ఎం ఎస్ ఎన్ పరిశ్రమ పరిధిలో నూతన పరిశ్రమ స్థాపనకు జరుగుతున్న సన్నాహాలను తిప్పికొడుతూ, జనవరి 7 వ తారీఖున భిక్కనూరు పట్టణ బంద్ కు బి ఆర్ ఎస్ సంపూర్ణ మద్దతును తెలుపుతూ పార్టీ సీనియర్ నేత మహేందర్ రెడ్డి పిలుపునిచ్చాడు. ఈ పరిశ్రమ వల్ల వాతావరణ కాలుష్యం తో పాటు, ప్రజా అనారోగ్యానికి తీవ్ర ముప్పు వాటిలనుందని, కావున పట్టణంలోని అన్ని వర్గాల వారు ముఖ్యంగా ఈ బందును విజయవంతం చేసి భిక్కనూరు పట్టణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మన పైన ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున టిఆర్ఎస్ శ్రేణులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

### - ప్రజా సమస్యల పరిష్కారంలో ముందుండాలి

**భిక్కనూరు, జనవరి 6 (ప్రజా జ్యోతి)**

భిక్కనూరు మండలం లక్ష్మదేవినిపల్లి గ్రామ సర్పంచిగా ఎన్నుకోబడ్డ జిల్లెల్ల లింగారెడ్డిని, బిజెపి జిల్లా కోశాధికారి రెడ్డి గారి రమేష్ రెడ్డి సన్మానించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పార్టీ బలోపేతానికి ఎల్లవేళలా కృషి చేస్తూనే, ప్రజా సమస్యల పరిష్కారంలో ముందుండాలని, నూతన ప్రణాళికలను సిద్ధం చేసుకుంటూ గ్రామ అభివృద్ధిలో ప్రత్యేక ఒరవడిని సృష్టించాలని సూచించాడు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు నాగర్తి నరేందర్ రెడ్డి,మండల కిసాన్ మోర్చా అధ్యక్షుడు జయపాల్ రెడ్డి, బీసీ మోర్చా ప్రధాన కార్యదర్శి ఏక్నాథ్, రామేశ్వర్ పల్లి సొసైటీ డైరెక్టర్ తక్కల్ల రాజేందర్ రెడ్డి, లక్ష్మదేవినిపల్లి బిజెపి గ్రామ అధ్యక్షుడు నాగర్తి నరేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# భవిత కేంద్రంలో దివ్యాంగులకు ఫిజియోథెరపీ వైద్య శిబిరం

## నరాల బలహీనతపై వైద్య పరీక్షలు వారానికి రెండుసార్లు థెరపీ చేయించాలి



**గాంధారి, జనవరి 6 (ప్రజాజ్యోతి)**

గాంధారి మండల కేంద్రంలో ఉన్న భవిత ప్రత్యేక పాఠశాలల్లో మంగళవారం దివ్యాంగ విద్యార్థులకు ఫిజియోథెరపీ వైద్య శిబిరాన్ని నిర్వహించారు. నరాల బలహీనతతో బాధపడుతున్న దివ్యాంగ పిల్లలకు డాక్టర్ స్వాతి వైద్య పరీక్షలు చేసి అవసరమైన సూచనలు అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, దివ్యాంగ పిల్లలు శారీరక అభివృద్ధి సాధించాలంటే వారానికి కనీసం రెండుసార్లు ఫిజియోథెరపీ క్యాంపులను తప్పనిసరిగా వినియోగించుకోవాలని సూచించారు. అలాగే తల్లిదండ్రులు పిల్లలకు ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం సాధారణ వ్యాయామాలు చేయించాలని పేర్కొన్నారు. ఇలా చేయడం ద్వారా వారి ఆరోగ్యం మెరుగుపడటంతో పాటు స్వీయాధారిత జీవనానికి తోడ్పడుతుందన్నారు. ఈ వైద్య శిబిరంలో ఎనిమిది మంది దివ్యాంగ విద్యార్థులు పాల్గొన్నారు. భవిత కేంద్రంలో అందిస్తున్న ఫిజియోథెరపీ సేవలను పరిసర గ్రామాల దివ్యాంగులు కూడా సద్వినియోగం చేసుకోవాలని ప్రత్యేక ఉపాధ్యాయుడు పెంటయ్య, రిసోర్స్ టీచర్ సాయన్నలు పిలుపునిచ్చారు.

# శ్రీ కోదండరామచంద్ర స్వామి ఆలయానికి రూ.1.25 లక్షల విరాళం



**గాంధారి, జనవరి 6 (ప్రజాజ్యోతి)**

గాంధారి మండలంలోని తిప్పారం తాండలో నిర్మాణంలో ఉన్న శ్రీ శ్రీ శ్రీ కోదండరామచంద్ర స్వామి ఆలయ నిర్మాణానికి లబనా సమాజ్ రాష్ట్ర అధ్యక్షుడు తాన్ సింగ్ నాయక్ తన వంతు సహాయంగా ఉదారంగా విరాళం అందజేశారు. మంగళవారం రోజున పార్టీ తరపున గుర్జాల్ తాండ గ్రామస్తుల సహకారంతో రూ.1,00,100/- విరాళాన్ని ఆలయ కమిటీకి అందజేశారు. అదేవిధంగా గుర్జాల్ తాండకు చెందిన తాన్ సింగ్ నాయక్ తన లిస్వంత సహాయంగా మరో రూ.25,555/-లిను ఆలయ నిర్మాణానికి అందజేసి తన సేవాభావాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఆయనను శాలువాతో ఘనంగా సన్మానించారు. శ్రీ శ్రీ శ్రీ కోదండరామచంద్ర స్వామి వారి మరియు శ్రీ చిన్నజీయర్ స్వామి వారి మంగళాశీస్సులు ఎల్లప్పుడూ ప్రజలపై ఉండాలని నాయకులు ఆకాంక్షంచారు. ఈ సహాయానికి తిప్పారం తాండ గ్రామ ప్రజలు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు.

# విద్యార్థులే ఉపాధ్యాయులైన రోజు





**నిజామాబాద్ రూరల్: జనవరి 6 (ప్రజా జ్యోతి)**

నిజామాబాద్ రూరల్ సిరికొండ మండల కేంద్రంలో ఉన్న జిల్లా పరిషత్ హైస్కూల్లో స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా "విద్యార్థులు ఉపాధ్యాయులైతే ఎలా?" అనే వినూత్న కాన్సెప్ట్‌తో ప్రత్యేక కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సతీష్ కుమార్‌తో పాటు అధ్యాపక బృందం పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులే ఉపాధ్యాయుల పాత్రను పోషిస్తూ తరగతులు నిర్వహించారు. ఉపాధ్యాయుడిలా పాఠాలు బోధించడం, విద్యార్థులను నియంత్రించడం, పాఠ్యాంశాలను అర్థమయ్యేలా వివరించడం వంటి అంశాల్లో తమ ప్రతిభను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు ఎదుర్కొనే కష్టాలు, బాధ్యతలు ఏమిటి అనే విషయాన్ని విద్యార్థులు ప్రత్యక్ష అనుభవం ద్వారా తెలుసుకొని, తమ అనుభూతులను తోటి విద్యార్థులతో పంచుకున్నారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో ఉపాధ్యాయుల పట్ల గౌరవం, బాధ్యతాభావం మరింత పెరిగిందని అధ్యాపకులు అభిప్రాయపడ్డారు. ఈ స్వయం పరిపాలన దినోత్సవ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఉత్సాహంగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# మాల్తుమ్మెద బాలుర పాఠశాలను తనిఖీ చేసిన ఫుడ్ సేఫ్టీ అధికారులు



**నాగిరెడ్డిపేట్, జనవరి6(ప్రజాజ్యోతి)**

నాగిరెడ్డిపేట్ మండలంలోని మాల్తుమ్మెద గ్రామంలోని బాలుర ప్రాథమిక పాఠశాలలో మంగళవారం ఫుడ్ సేఫ్టీ అధికారులు తనిఖీలు నిర్వహించారు. పాఠశాలలోని 8మందివిద్యార్థులు మధ్యాహ్న భోజనం వికటించి ఫుడ్ పాయిజన్‌తో తీవ్ర అస్వస్థతకు లోనవడంతో వెంటనే ఫుడ్ సేఫ్టీ అధికారులు తనిఖీ చేశారు. జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి అబశ్రీశ్రీ విక్రమ్ పాఠశాలలోని వంట గది,అబశ్రీశ్రీసరుకులు కోడిగుడ్లు , ఆహార పదార్థాలు, వంటనూనె తో పాటు భోజన శాంపిల్స్ సేకరించారు . ఈ నమూనాలను పరిక్ష నిమిత్తం ల్యాబ్ కు పంపుతామని ఆయన తెలిపారు. ఇక్కడ వంట చేసే మహిళ వృద్దురాలును తక్షణమే మార్చివేసి మరొక మహిళను నియమించాలని తెలిపారు. వారి వెంట ఇంచార్జి ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్, ప్రధానోపాధ్యాయురాలు లక్ష్మ తులసి,గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.



## ఔషధ మొక్కల బయోటెక్నాలజీపై అవగాహన

**నిజామాబాద్ రూరల్: జనవరి, 6 (ప్రజా జ్యోతి)**

తెలంగాణ విశ్వవిద్యాలయంలోని వృక్షశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో మంగళవారం "ఔషధ మొక్కల సుస్థిర వినియోగానికి ఇన్ విట్రో బయోటెక్నాలజీ విధానాలు" అనే అంశంపై ఆహ్వానిత ఉపన్యాస కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఉస్మానియా విశ్వవిద్యాలయం వృక్షశాస్త్ర విభాగాధిపతి ప్రొఫెసర్ ఏ. సబితా రాణి హాజరై ప్రసంగించారు. ఔషధ మొక్కలపై పెరుగుతున్న డిమాండ్ వల్ల అనేక విలువైన మొక్కల జాతులు అంతరించిపోతున్నాయని, దీనివల్ల నకిలీ ముడి పదార్థాలు, ఔషధాల నాణ్యత లోపాలు తలెత్తుతున్నాయని ఆమె తెలిపారు. ఈ సమస్యలకు పరిష్కారంగా ప్లాంట్ టిష్యూ కల్చర్, కాలస్ కల్చర్, సెల్ సస్పెన్షన్, హెయిరీ రూట్ కల్చర్ వంటి ఇన్ విట్రో పద్ధతులు ఎంతో ఉపయోగకరమని వివరించారు. ద్వితీయక మెటబోలైట్లు ఔషధ గుణాలకు ప్రధాన ఆధారమని, బయోరియాక్టర్ల ద్వారా పరిశ్రమల స్థాయిలో ఉత్పత్తి సాధ్యమని పేర్కొన్నారు. ఈ ఉపన్యాసం ద్వారా ఔషధ మొక్కల సంరక్షణ, ఆధునిక శాస్త్రీయ వినియోగంపై అవగాహన పెరిగిందని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో డా. అహ్మద్ అబ్దుల్ హలీమ్ ఖాన్, ప్రొఫెసర్ ఎం. అరుణ, ప్రొఫెసర్ బి. విద్యావర్ధిని, డా. ఎ. మహేందర్ తదితర అధ్యాపకులు, ఎం.ఎస్‌సి వృక్షశాస్త్రం విద్యార్థులు పాల్గొన్నారు.




## ఆర్ట్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్‌గా ఆచార్య గోపిశెట్టి రాంబాబు నియామకం



**నిజామాబాద్ రూరల్: జనవరి, 6 (ప్రజా జ్యోతి)**

తెలంగాణ విశ్వవిద్యాలయంలోని ఆర్ట్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్‌గా ఆచార్య గోపిశెట్టి రాంబాబును నియమించారు. వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ టి. యాదగిరిరావు ఆదేశాల మేరకు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎం. యాదగిరి నియామక ఉత్తర్వులను అందజేశారు. ఆచార్య గోపిశెట్టి రాంబాబు అర్థశాస్త్ర విభాగంలో 18 సంవత్సరాల బోధన, పరిశోధన అనుభవం కలిగిన ప్రముఖ అధ్యాపకులు. తెలంగాణ విశ్వవిద్యాలయంలో కామర్స్ విభాగం హెడ్‌గా, బోర్డ్ ఆఫ్ స్టడీస్ (బీఓఎస్) చైర్మన్‌గా పలు అకాడమిక్ పదవులను సమర్థవంతంగా నిర్వహించారు. ప్రస్తుతం డీన్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఈ సందర్భంగా తనపై నమ్మకంతో ఈ బాధ్యతలు అప్పగించిన వైస్ ఛాన్సలర్, రిజిస్ట్రార్‌లకు, తోటి అధ్యాపకులకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. అప్పగించిన బాధ్యతలను నిబద్ధతతో, సమర్థంగా నిర్వహిస్తానని హామీ ఇచ్చారు.

# చంద్రాయన్ పల్లి అంగన్వాడి పిల్లల సంక్షేమానికి చర్యలు

## యూనిఫామ్ పౌష్టికాహారం అందించాలంటూ సర్పంచ్ రఘు ఆదేశం





**ఇందల్వాయి( ప్రజా జ్యోతి న్యూస్) జనవరి. 6**
అందాల వై మండల కేంద్రంలోని కేంద్రాయన్ పల్లి గ్రామంలో నూతనంగా ప్రజల చేత ఎన్నుకోబడిన సర్పంచ్ రఘు ఉపసర్పంచ్ సంజీవ్ గౌడ్ గ్రామ అభివృద్ధి తో పాటు చిన్నారుల సంక్షమపై ప్రత్యేక దృష్టి సాధించారు ఈ సందర్భంగా గ్రామంలో అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించిన సర్పంచ్ రఘు. ఉప సర్పంచ్ సంజీవ్ గౌడ్ అంగన్వాడీ టీచర్ ఆయామను పిల్లలకు అవసరమైన సదుపాయాలపై ఆరా తీశారు. అంగన్వాడి పిల్లలకు తప్పనిసరిగా యూనిఫాంలో పోస్ట్ కారం అందించాలని ముఖ్యంగా గుడ్లు పాలు వంటి క్రమం తప్పకుండా అందేలా చూడాలని సర్పంచ్ రఘు సూచించారు. చిన్నారుల ఆరోగ్యమే గ్రామ భవిష్యత్తు అని వారు శరీరక మానసిక అభివృద్ధి పోస్ట్ ఆహారం ఎంతో అవసరం అని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ సంజీవ్ గౌడ్ మాట్లాడుతూ గ్రామాల్లో అంగన్వాడీ కేంద్రాలను మరింత బల్లపేతం చేయడానికి గ్రామపంచాయతీ పూర్తి సహకారం అందిస్తుందని తెలిపారు అంగన్వాడీ టీచర్ ఆయమ్మ కూడా పిల్లలు సంక్షమానికి అందుతున్న సమాచారంపై సంతృప్తి వ్యక్తం చేశారు. గ్రామ ప్రజల నూతన సర్పంచ్ తీసుకుంటున్న ఈ నిర్ణయం పై వర్షం వ్యక్తం చేస్తూ పిల్లల భవిష్యత్తు కోసం ఇలాంటి చేయలు మరింత కొనసాగాలని కోరారు.

# రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు తూపల్లి క్రీడాకారుల ఎంపిక



**నిజామాబాద్ జనవరి 6 (ప్రజా జ్యోతి)**
సిరికొండ మండలంలోని తూపల్లి గ్రామానికి చెందిన పలువురు క్రీడాకారులు ఉమ్మడి జిల్లాల స్థాయి ఎంపిక హాకీ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు ఎంపికైనట్లు పీడీ సడక్ నగేష్ తెలిపారు.
రాష్ట్రస్థాయికి ఎంపికైన క్రీడాకారుల్లో భరత్, సిద్ధు, పవన్ జస్వంత్, శ్రీనిధి, రసజ్ఞ, అక్షయ, వైష్ణవి, జాహ్నవి, నికిత, చికిత ఉన్నారు. ఈ రాష్ట్రస్థాయి హాకీ పోటీలు ఈనెల 8 నుంచి 10 వరకు వనపర్తి జిల్లాలో జరగనున్నాయి.
రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులను ఎంఈఓ పి. రాములు, ఇన్‌చార్జి హెచ్ఎం ఏ. మనోహర్, ఉపాధ్యాయ బృందం, గ్రామ సర్పంచ్ జినుక రాజేందర్, ఉపసర్పంచ్ శ్రీకాంత్, వీడీసీ సభ్యులు అభినందించారు. క్రీడాకారులు రాష్ట్రస్థాయిలోనూ మంచి ప్రతిభ కనబర్చాలని వారు ఆకాంక్షంచారు.

# బోధన్ మున్సిపాలిటీపై బీజేపీ జెండా ఎగరవేస్తాం





**బోధన్ జనవరి 06 (ప్రజాజ్యోతి)**
రానున్న మున్సిపల్ ఎన్నికల్లో బోధన్ మున్సిపాలిటీపై బీజేపీ జెండా ఎగరవేస్తామని భాజపా జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి అన్నారు. నిజామాబాద్ జిల్లా బోధన్ పట్టణంలోని ఎం పి ఆర్ (వీూ=) కార్యాలయంలో భాజపా నాయకులు, కార్యకర్తలతో మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా జిల్లా అధ్యక్షులు దినేష్ కులాచారి హాజరై మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో సమీక్ష సమావేశం నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వాన్ని విశ్వసిస్తూ కమలం పువ్వు వైపే చూస్తున్నారని తెలిపారు. జరగబోయే మున్సిపల్ ఎన్నికల్లో పట్టణ నాయకులు, కార్యకర్తలు పరస్పర సమన్వయంతో సమిష్టిగా పనిచేయాలని సూచించారు. బోధన్ మున్సిపాలిటీపై బీజేపీ జెండా ఎగురవేయాలని అన్నారు. రాబోయే ఎన్నికల్లో నిజామాబాద్ జిల్లాలో మూడు మున్సిపాలిటీలు, అలాగే నిజామాబాద్ మేయర్ పదవిని కూడా బీజేపీ కైవసం చేసుకుంటుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. అనంతరం బీజేపీ పట్టణ శాఖ నాయకులు జిల్లా అధ్యక్షుడిని శాలువాలు, పుష్పగుచ్చాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు కందగట్ల రామచందర్, ఐటీ సెల్ జిల్లా కన్వీనర్ పిల్లి శ్రీకాంత్, బోధన్ పట్టణ అధ్యక్షులు పసులోటి గోపీ కిషన్, మాజీ పట్టణ అధ్యక్షులు కొలిపాక బాలరాజు, మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ మాసిని వినోద్, పట్టణ ప్రధాన కార్యదర్శి మీర్జాపురం అరవింద్, సీనియర్ నాయకులు సింది విజయ్, హన్మండ్లు చారి, గుంత గంగాధర్, పట్టణ ఉపాధ్యక్షులు గాదె సందీప్, రవీందర్, పట్టణ కార్యదర్శి గంగుల శ్రీకాంత్, బీజేవైఎం పట్టణ అధ్యక్షులు ఏనుగంటి గౌతం గౌడ్, దళిత మోర్చా అధ్యక్షులు కృష్ణ, కిసాన్ మోర్చా అధ్యక్షులు ఏశాల సూరి, బీజేవైఎం నాయకులు ధ్యాకం శ్రీకాంత్, ఫణి తదితరులు పాల్గొన్నారు.

# నేడు రూరల్ ఎమ్మెల్యే డా. ఆర్. భూపతి రెడ్డి చేతుల మీదుగా కళ్యాణ లక్ష్మి, చెక్కుల పంపిణీ



**నిజామాబాద్ రూరల్, జనవరి 6 (ప్రజా జ్యోతి)**
నిజామాబాద్ రూరల్ శాసనసభ్యులు గౌరవ శ్రీ డా. ఆర్. భూపతి రెడ్డి నేడు బుధవారం నియోజకవర్గంలో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా ఆయన క్యాంపు కార్యాలయం నుంచి విడుదల చేసిన షెడ్యూల్ ప్రకారం పలు కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. ఉదయం 8.30 గంటలకు హైదరాబాద్ నుంచి బయలుదేరిన ఎమ్మెల్యే గారు ధర్పల్లి మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయానికి చేరుకుంటారు. అనంతరం ఉదయం 10.30 గంటలకు ధర్పల్లి ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో నిర్వహించే కార్యక్రమంలో ధర్పల్లి, సిరికొండ, ఇందల్వాయి మండలాలకు చెందిన అర్హులైన లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మ, శాదీ ముభారక్ పథకాల కింద చెక్కులను పంపిణీ చేస్తారు.
ఈ కార్యక్రమానికి సంబంధించి నియోజకవర్గ ప్రజలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం విడుదల చేసిన పత్రికా ప్రకటనలో పేర్కొన్నారు.

# ఉపాధ్యాయ వృత్తి కే కలంకం తెచ్చిన ఘనుడు

## కట్టుకున్న భార్య ను వదిలి పరాయి స్త్రీ తో....




**ఆర్మూర్,జనవరి 6(ప్రజాజ్యోతి)**
ఆర్మూర్, కట్టుకున్న భర్త తనను కాదని రెండవ వివాహం చేసుకున్నాడని,అది కూడా చదువు నేర్పిన విద్యార్థిని వివాహమాడాడని భార్య మధులత ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్మూరు పట్టణంలోని ప్రెస్ క్లబ్ భవనంలో ఆమె మీడియా సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఆర్మూర్ పట్టణానికి చెందిన కాశీపాక మధులత, మదనం రాములు 20 సంవత్సరాలు క్రితం ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. సికింద్రపూర్ లో ప్రభుత్వ ఉద్యోగరీత్యా టీచర్ గా వెళ్లిన మధనం రాములు తన స్టూడెంట్ తో ప్రేమ వ్యవహారం నడిపించి, తనను మానసిక, శారీరక ఇబ్బందులకు గురి చేసే వాడని,విద్యార్థిని పెళ్లి చేసుకుంటానని అనేకమార్లు తనతో గొడవపడే వాడని తెలిపింది. గత వారం రోజులుగా అనేకసార్లు తనతో గొడవపడి చివరకు అమ్మాయితో వెళ్లిపోయాడని, వెళ్తూ వెళ్తూ ఇంట్లో ఉన్న నగలు, ఆస్తి పత్రాలు, డబ్బులు సైతం తీసుకువెళ్లాడని, తనకు తన పిల్లలకు ఎటువంటి రక్షణ లేకుండా పోయిందని, పోలీసుల సైతం ఫిర్యాదు చేశామని తెలిపింది. అధికారులు తన భర్త తన వద్దకు వచ్చే విధంగా చూడాలని కోరింది.

# నూతనంగా ఎన్నికైన మాల సర్పంచులకు ఘన సన్మాన కార్యక్రమం

**నిజామాబాద్ రూరల్: జనవరి, 8 (ప్రజా జ్యోతి)**
నూతనంగా ఎన్నికైన మాల సర్పంచులకు మాల మహానాడు జిల్లా కమిటీ, మాల జేఏసీ ఆధ్వర్యంలో ఘన ఆత్మీయ సన్మాన మహోత్సవం కార్యక్రమాన్ని ఈ నెల 10వ తేదీ (శనివారం) నిర్వహించనున్నట్లు మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు సఖి విజయ్ కుమార్ పత్రికా ప్రకటన ద్వారా తెలిపారు. ఈ సన్మాన కార్యక్రమం నిజామాబాద్ నగరంలోని ఎన్‌టీఆర్ చౌరస్తా వద్ద గల టీఎన్ జోవో ఆఫీస్ సెకండ్ ఫ్లోర్‌లో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా గెలుపొందిన మాల సర్పంచులకు శుభాకాంక్షలు తెలుపుతూ ఘనంగా సన్మానం చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ కోదండరాం, ప్రభుత్వ సలహాదారులు ఎమ్మెల్యే పి. సుదర్శన్ రెడ్డి, షబ్బీర్ అలీ, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డా. రేకులపల్లి భూపతి రెడ్డి, నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధనపాల్ సూర్యనారాయణ, వర్ధన్నపేట ఎమ్మెల్యే .ఆర్. నాగరాజ్, మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు తాళ్లపల్లి రవి, జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ గైని గంగారం, జేఏసీ చైర్మన్ మండల భాస్కర్, జేఏసీ నేత చెరుకు రామచందర్ తదితరులు హాజరుకానున్నట్లు తెలిపారు.
ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా వ్యాప్తంగా ఉన్న మాల నాయకులు, కార్యకర్తలకు ఆయన పిలుపునిచ్చారు.



# జాన్కంపేటలో ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్






**బోధన్ జనవరి 06 (ప్రజాజ్యోతి)**

ఎడపల్లి మండలం జాన్కంపేట గ్రామంలో మంగళవారం పారిశుధ్యంపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచాలనే లక్ష్యంతో గ్రామ పంచాయతీ పాలకవర్గం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు పంచాయతీ అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రధాన వీధులు, కాలనీలు, డ్రైనేజీలు, ప్రభుత్వ కార్యాలయాల పరిసరాల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించి శుభ్రత కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఉప సర్పంచ్ నీలం కృష్ణ మాట్లాడుతూ, గ్రామంలో పారిశుధ్యం మెరుగుపడాలంటే ప్రజల సహకారం అత్యంత అవసరమని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఇళ్ల ముందు శుభ్రత పాటించడంతో పాటు చెత్తను ఎక్కడికక్కడ వేయకుండా నిర్ణీత ప్రదేశాల్లోనే వేయాలని సూచించారు. పరిశుభ్రమైన గ్రామమే ఆరోగ్యకరమైన గ్రామమని, గ్రామాభివృద్ధికి పారిశుధ్యం కీలకమని ఆయన అన్నారు. ఈ ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్‌లో పంచాయతీ కార్యదర్శి సందీప్, గ్రామ పంచాయతీ సభ్యులు క్రాంతి కుమార్, వెలుమల మురళి, పారిశుధ్య సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

## కేజీబీవీ పాఠశాలలో విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ





**నిజామాబాద్ రూరల్: జనవరి, 8 (ప్రజా జ్యోతి)**




సిరికొండ మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)లో మంగళవారం విద్యార్థులకు అవసరమైన పరీక్ష సామగ్రిని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నిజామాబాద్ ఎన్‌డీసీసీ జనరల్ మేనేజర్ అనుపమ సామాజిక సేవ సంస్థ శ్రీనివాస్ ఆధ్వర్యంలో పదవ తరగతి చదువుతున్న 15 మంది విద్యార్థులకు ఎగ్జామ్ ప్యాడ్ పెన్నులను అందజేశారు. అలాగే ఆరు నుంచి పదవ తరగతి వరకు ఫస్ట్, సెకండ్ స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు కలర్ మార్కర్లు, పెన్సిళ్లను అందజేశారు. విద్యార్థుల విద్యాభివృద్ధికి ఇలాంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని ఈ సందర్భంగా అనుపమ పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు అనుపమ మేడంకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కేజీబీవీ పాఠశాల ప్రిన్సిపాల్ షేక్ ప్రవీణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## కేంద్రం ఉపాధి హామీ చట్టంపై రైతు, కార్మిక సంఘాల ఆందోళన




**నిజామాబాద్ రూరల్: జనవరి, 6 (ప్రజా జ్యోతి)**

అఖిల భారత ఐక్యరైతు సంఘం ఏ ఐ యు ఎస్ మరియు అఖిలభారత ప్రగతిశీల వ్యవసాయ కార్మికసంఘం ఏఐపికే ఎంఎస్ ఆధ్వర్యంలో మంగళవారం సిరికొండ మండల కేంద్రంలోని సొసైటీ మీటింగ్ హాల్‌లో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ ఐ యు ఎస్ రాష్ట్ర కార్యదర్శి వి. ప్రభాకర్ ప్రధాన అతిథిగా పాల్గొని మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ చర్యలను విమర్శిస్తూ, విబిజీ రామ్ జీ మిషన్ వెంటనే రద్దు చేసి, ఎం.జి.ఎన్.ఆర్.ఇ.జీ.ఎస్ ఉపాధి హామీ చట్టాన్ని కొనసాగించాలంటూ డిమాండ్ చేశారు. కూలీలు కు ఉపాధి లేకుండా చేయడానికి యుద్ధ యుద్ధ ప్రతిపాదికన బి బి జి రామ్ జి మిషన్ పేరిట మార్ చి కార్పొరేట్ శక్తుల కొమ్ము కాయడానికి పూనుకున్నదని అన్నారు. కేంద్రం అన్ని రాజకీయ పక్షలతో కలిసి సమగ్ర చర్యలు చేపట్టాలి. ఈసమావేశానికి కాంగ్రెస్ ఏఐయుకేఎస్, ఏఐ పీకే ఎమ్మెస్ నేతలు, సర్పంచ్‌లు, కార్మిక సంఘాలు రైతు సంఘాల ప్రతినిధులు హాజరయ్యారు.

### జంటనాగుల విగ్రహ ప్రతిష్ఠకు విరాళం అందజేత.

**బోధన్ జనవరి 06 (ప్రజాజ్యోతి)**

నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండలం జాన్కంపేట శివారు ప్రాంతంలో ఉన్న స్వయంభు శివాలయం ఆవరణలో జంటనాగుల విగ్రహ ప్రతిష్ఠాపన కొరకు మంగళవారం బోధన్ డివిజనల్ పంచాయతీ అధికారి సార్థ నీలిమారాణీ నాగరాజు దంపతులు 25 వేల రూపాయల విరాళాన్ని ఆలయ కమిటీకి అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ ఉప్పు సురేష్ మాట్లాడుతూ జంటనాగుల విగ్రహ ప్రతిష్ఠాపన కొరకు సార్థ నీలిమారాణీ నాగరాజు దంపతులు 25 వేల రూపాయల విరాళాన్ని అందజేశారని వారికి పరమశివుని ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



### వెల్నెస్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం.




**రెంజల్, జనవరి 06(ప్రజాజ్యోతి ):**

రెంజల్ మండలంలోని సాటాపూర్ గ్రామంలో గల రైతు వేదికలో 7వ తేదీన వెల్నెస్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు హాస్పిటల్స్ మేనేజింగ్ డైరెక్టర్స్ అసద్, సుమన్ గౌడ్ ఒక ప్రకటనలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెంజల్ మండలంలోని సాటాపూర్ గ్రామంలో గల రైతు వేదికలో బుధవారం రోజున ఉచిత వైద్య శిబిరం నిర్వహించడం జరుగుతుందని ఈ ఉచిత వైద్య శిబిరం ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం రెండు గంటల వరకు నిర్వహించడం జరుగుతుంది. ఈ అవకాశాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వారు పేర్కొన్నారు.

## ఎడపల్లి బస్టాండ్‌కు బస్సుల రాకపోకలు కొనసాగించాలి

### సర్పంచ్ కందగట్ల రాంచందర్



**బోధన్ జనవరి 06 (ప్రజాజ్యోతి)**

ఎడపల్లి బస్టాండ్‌లోకి ఆర్టీసీ బస్సుల రాకపోకలు నిరంతరంగా కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని సర్పంచ్ కందగట్ల రాంచందర్ (అన్నాసేట్) బోధన్ ఆర్టీసీ డిపో మేనేజర్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బస్టాండ్‌లోకి బస్సుల రాకపోకలు సాగకపోవడం వల్ల ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. విద్యార్థులు, ఉద్యోగులు, వృద్ధులు అధికంగా ఇబ్బంది పడుతున్న నేపథ్యంలో వెంటనే సమస్యను పరిష్కరించాలని కోరారు. ప్రజల సౌకర్యార్థం ఎడపల్లి బస్టాండ్‌లోకి బస్సుల రాకపోకలను పునరుద్ధరించాలని ఆర్టీసీ అధికారులను సర్పంచ్ విజ్ఞప్తి చేశారు.

## పేకాట స్థావరంపై సిసిఎస్ టీం మెరుపు దాడి

**నిజామాబాద్ రూరల్: జనవరి, 8 (ప్రజా జ్యోతి)**

నిజామాబాద్ పోలీస్ కమిషనర్ శ్రీ పి. సాయి చైతన్య ఆదేశాల మేరకు మంగళవారం సాయంత్రం సి సి ఎస్ ఏసీపీ ఇన్‌చార్జ్ శ్రీ మస్తాన్ అలీ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందం పేకాట స్థావరంపై మెరుపు దాడి నిర్వహించింది. నవీపేట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని అల్జాపూర్ శివారు అటవీ ప్రాంతంలో అక్రమంగా పేకాట నిర్వహిస్తున్నట్లు సమాచారం అందడంతో ఎస్సై లు గోవింద్, మహేష్‌లు సిబ్బందితో కలిసి రైడ్ చేశారు. ఈ దాడిలో 11 మంది పేకాట రాయుళ్లను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి 10 సెల్‌ఫోన్లు, నగదు రూ.31,410ను స్వాధీనం చేసుకున్నారు.
పట్టుబడిన వారిని, స్వాధీనం చేసిన వస్తువులను తదుపరి చర్యల కోసం నవీపేట్ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓకు అప్పగించినట్లు తెలిపారు.

## ప్రభుత్వ స్థలంలో అక్రమ నిర్మాణాలు తొలగించాలి: డీఎల్పీవో

**బోధన్ జనవరి 06 (ప్రజాజ్యోతి)**

సాలూర మండల కేంద్రంలో ప్రభుత్వ స్థలంలో అక్రమంగా నిర్మాణాలు చేపడుతున్నారనే ఫిర్యాదు రావడంతో మంగళవారం డీఎల్పీవో స్థల పరిశీలన చేపట్టారు. ఈ సందర్భంగా ప్రభుత్వ స్థలంలో నిర్మించిన అక్రమ నిర్మాణాలను వెంటనే కూల్చివేయాలని పంచాయతీ అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ భూముల పరిరక్షణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని సూచించిన ఆయన, ఇలాంటి అక్రమాలు పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ఈ పరిశీలనలో సాలూర పంచాయతీ కార్యదర్శి దయాకర్ రెడ్డి, ఉప సర్పంచ్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

